ప్రజాశక్తి
సోమవారం 2 అక్టోబర్ 2023



7లోగా కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కళాకారులు గుర్తింపు కార్డుల కోసం ఈనెల 7లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అర్హులైన కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డులను పొందుటకు పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, కులము, కళా రూపం, అనుభవం, లింగం (జెండర్), బ్లడ్ గ్రూపు, చిరునామా, గుర్తింపు పొందిన కళాకారుల సంఘం ధవీకరణ పత్రం, మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్, ఇ-మెయిల్ అడ్రస్ తదితర పూర్తి వివరాలను తెలుపుతూ సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి దరఖాస్తులను ఈనెల 7 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, పార్వతీపురంలో సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.



విద్యా రంగ సమస్యలపై నేటి నుంచి ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర

- 15 మండలాలు.. 400 కిలోమీటర్లు
- పాచిపెంటలో ప్రారంభం



ప్రజాశక్తి-పార్వతీపురం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి సైకిల్‌యాత్ర చేపట్టనున్నారు. విద్యారంగ ప్రైవేటీకరణ దిశగా పాలకులు చేపడుతున్న అనేక విధానాలతో ప్రభుత్వ విద్య పేదలకు అందకుండా పోతోందని, ఈ తరుణంలో జిల్లా విద్యారంగ సమస్యలపై, విద్యరంగ అభివృద్ధికై విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం పాచిపెంట మండల కేంద్రంలో ప్రారంభం కానున్న ఈ యాత్ర ఈనెల 11న పార్వతీపురంలో ముగియనుంది. సంక్షేమ హాస్టలకు బకాయిలుగా నిలిచిన మెస్ (డైట్) బిల్లులు వెంటనే విడు దల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకువచ్చిన హానర్స్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా ఎన్ఇపి రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లలో పర్మినెంట్ వర్కర్లను, వార్డెన్లను నియమించాలని, పోస్టుమెట్రిక్ హాస్టలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, పాచిపెంటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, సాలూరు పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాల నిర్మించాలని, మక్కువలో పోస్టుమెట్రిక్ హాస్టలను నిర్మించాలని, సీతానగరంలో పోస్ట్ మెట్రిక్ హాస్టలను నిర్మించాలని, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకొండ గిరిజన పోస్ట్ మెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టలుకు సొంత భవనం నిర్మించాలని, నియోజకవర్గ కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, సీతంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. గుమ్మలక్ష్మీపురం పోస్టుమెట్రిక్ హాస్టలుకు అదనపు భవనం ఏర్పాటు చేయాలని, కురుపాంలో సొంత భవనం ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు. పార్వతీపురం గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టలకు అదనపు భవనాలు నిర్మించాలని, ఎస్‌సి, బిసి పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని మరియు తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈ యాత్ర చేపడుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, అభ్యుదయ వాదులు పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విజ్ఞప్తి చేశారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

గుమ్మలక్ష్మీపురం : విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 2 నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే సైకిల్ యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎ.గంగారావు మాట్లాడుతూ అక్టోబర్ 2న పాచిపెంటలో సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాల మెస్ బిల్లులు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలని అన్నారు. జిఒ 117 రద్దుచేసి పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, వసతి గహాల్లో సిబ్బందిని నియమించాలని, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని సమస్యలపై సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బి అనిల్, ఎ సురేష్, రవి ఉన్నారు.

వీడని ఏనుగుల సమస్య

- 17 ఏళ్లుగా పంటలు నాశనం
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ప్రజల పాపమో లేక పాలకుల నిర్లక్ష్యమో తెలియదు గానీ గత కొన్నేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లాను అడవి జంతువుల బెడద వెంటాడుతుంది. జిల్లా ఏర్పాటైన తర్వాత వీటి సంఖ్య మరింతగా పెరిగింది. దీంతో ప్రజా జీవనానికి, వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఫ్యాక్టరీల పేరుతో అడవులను నాశనం చేయడంతో అడవిలో ఉండాల్సిన వన్య ప్రాణులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క జనావాసాల్లోకి వస్తున్నాయి. అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ ప్రాణాలను తీస్తూ, పంటలను సర్వనాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. అయినా అధికారులకు, పాలకులు పట్టడం లేదు.

17 ఏళ్లుగా వీడని ఏనుగుల సమస్య

మన్య ప్రాంతంలో అడవి ఏనుగుల సమస్య ఈనాటిది కాదు. గత 17 ఏళ్లుగా ఉంది. ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా అవి విఫలం కావడంతో ప్రభుత్వం చేతులెత్తేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అడవి ఏనుగుల గుంపు కదలికలపై మాత్రమే అటవీశాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారు. 2006లో ఒడిశా రాష్ట్రం లఖేరి అడవుల నుంచి 11 ఏనుగుల గుంపు గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీకి వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు వాటి సంఖ్య పెరుగుతూ నాలుగు దిక్కులా విస్తరించాయి. ఏనుగుల దాడిలో ఇప్పటి వరకు 15 మంది మృత్యువాత పడ్డారు. జియమ్మ వలస, కొమరాడ, కురుపాం మండలం జరడ, బలిజిపేట, వీరఘట్టం ప్రాంతాల్లో అడవి ఏనుగుల గుంపు సంచారంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. మరోవైపు ఈ మధ్య కాలంలో పెద్దపులి అడుగు జాడలు భామిని, కంబర, సీతంపేట పరిసరాల్లో కనిపించింది. దీంతో పులి సంచారం ఉందని కొందరు, పులిని చూశామని మరికొందరు చెప్పడంతో ప్రజల్లో భయం మరింత రెట్టింపు అయింది. గత ఏడాది కురుపాం ఏజెన్సీలో ఎలుగుబంట్లు సంచారం కూడా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది.



రామినాయుడువలసలో జొన్నపంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

చెరుకు, మొక్కజొన్న తోటల్లో ఏనుగులు గుంపు సంచారం

కురుపాం: మండలంలోని రామినాయడువలస, కన్నపుదొరవలస గ్రామాల మధ్య ఆదివారం ఏడు ఏనుగుల గుంపు సంచారిస్తు సమీప చెరుకు, మొక్క జొన్న తోటల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆ గ్రామాల రైతులు మాట్లాడుతూ ఇంతవరకు ప్రశాంతంగా ఉంటూ పంటలను సాగు చేసుకుంటున్న సమయంలో ఏనుగులు మా గ్రామాల మధ్య సంచరిస్తుండంతో ఏ క్షణాన ఏం జరుగుతుందని భయభ్రాంతులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తామంతా రైతు కుటుంబాలమేనని, పంటలను సాగు చేసుకుంటూ నిత్యం పొలాల్లో ఉంటూ వ్యవసాయన్ని నమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని అటువంటిది ఏనుగులు ఏ క్షణాన ఏం చేస్తాయోనని భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు. కావున సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి మా ప్రాంతం నుండి ఏనుగుల గుంపును దూర ప్రాంతాలకు తరలించి తమ పంటలను, మా ప్రాణాలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

ఖరీఫ్ సీజన్‌లో పంటలను అడవి ఏనుగులు నాశనం చేస్తున్నాయి. వేలాది రూపాయలు అప్పులు చేసి వరి, అరటి, మొక్క జొన్న పంటలు వేసుకుంటే ఏనుగుల సంచారంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఐటిడిఎ, అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి ప్రజలను, పంటలను కాపాడాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు

అడవి ఏనుగుల సంచారంతో ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైంది. గత కొన్నేళ్లుగా అడవి ఏనుగుల సమస్య ప్రజలను వెంటాడుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం సరైన చొరవ తీసుకోవడం లేదు. దీంతో అడవి ఏనుగుల బెడద దీర్ఘకాలిక సమస్య గానే మిగిలిపోయింది.

కె. సీతారాం
సిపిఎం మండల కార్యదర్శి, జియమ్మవలస



బీడువారిన భూములను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఏజెన్సీలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి


సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో వర్ష ప్రభావం సరిగ్గా లేక కొన్ని గ్రామాల్లో పూర్తిగా వరి నాట్లు పడలేదని కరువు సహాయక చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో గుజ్జువాయి పంచాయతీలో డి.బారామణి, కాలనీగూడా తదితర గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష ప్రభావం సరిగ్గా లేక ఆకు మడలతో ఉండిపోయావని, సుమారు వంద ఎకరాలు వరినాట్లు పడలేదని అన్నారు. ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఉదయపురం పంచాయతీలో గల జాకరగూడ, సంజువాయి, కాకితాడ, మొండెంఖల్ గల పంచాయతీలో గల ఇచ్ఛాపురం గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు నిధులతో కొంత వరకు సిసి రోడ్లై అయ్యాయని,ఇంకా చాలావరకు రహదారులు శంకుస్థాపనలు జరిగాయి కానీ పనులు ఇంకా జరగలేదని అన్నారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన గ్రామాల్లో అన్ని రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆరిక మన్మధరావు, ఎ.కృష్ణారావు, శ్రీనివాస్, టి.శంకరరావు, కె.వైకుంఠం, మండంగి కృష్ణారావు, రంగారావు, మండంగి ఇండియా, వాసు, బి.అనీల్ పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి రాకపోతే నష్టం

నియోజకవర్గ స్థాయి సమావేశంలో డిప్యూటీ సిఎం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి రాకపోతే ప్రజలకు నష్టమని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ఆదివారం స్థానిక శివాలయం వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో జగనన్న ఆరోగ్య సురక్షపై నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశం లో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదల ఇంటికే వైద్య సేవలు అందే అవకాశం ఉందన్నారు. నిపుణులైన వైద్యులు గ్రామాల్లో నిర్వహించనున్న శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. కావున పేదలంతా వినియోగించుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈనెల 9న రాజధానిలో నిర్వహించనున్న సమావేశానికి పార్టీకి చెందిన సర్పంచ్‌లు ఎంపిటిసి సభ్యులు జడ్పీటీసీ లు,ఎంపిలు, జెసిఎస్ కన్వీనర్‌లు, సచివాలయం కన్వీనర్లు, మున్సిపల్ చైర్మన్లు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ లు జర్జాపు దీప్తి వంగపండు అప్పలనాయుడు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మక్కువ జెడ్పీటీసీ శ్రీనివాసరావు నాయుడు, సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, రంగు నాయుడు, జి.ముత్యాలు నాయుడు, ఎంపిపి ప్రమీల, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, మెంటాడ ఎంపిపి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సువ్వాడ రామకృష్ణ అలక

మండల వైసిపి అధ్యక్షుడిగా సువ్వాడ భరత్ శ్రీనివాసరావును పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఆ పదవిని ఆశించిన మాజీ వైస్ ఎంపిపి సువ్వాడ రామకృష్ణ అలక వహించినట్లు తెలుస్తోంది. గత రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ కార్యక్రమాలకు ఆయన హాజరు కావడం లేదు. శనివారం మండలంలోని అన్నంరాజువలసలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లో డిప్యూటీ సీఎం రాజన్నదొరతో సహా ముఖ్య మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆదివారం సాలూరు పట్టణంలోని నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి కూడా సువ్వాడ రామకష్ణ గైర్హాజరయ్యారు. సువ్వాడ భరత్ శ్రీనివాసరావు యువకుడు విద్యావంతుడు కావడంతో అధిస్థానం ఆయన పేరును మండల పార్టీ అధ్యక్షునిగా ఎంపిక చేసింది. వివాదరహితుడైన నాయకుడిగా ముద్రపడిన సువ్వాడ రమణ కొంత కాలం వైసిపి మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కుమారుడైన భరత్ శ్రీనివాసరావుకే మండల పార్టీ నాయకత్వం అప్పగించాలని మెజారిటీ నాయకులు సిఫార్సు చేశారు. దీంతో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆయన పేరునే ఖరారు చేశారు.

ఉపాధ్యాయులు లేకుండా పరీక్షలెలా ?

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించాలని లక్ష్యంతో పాఠశాలలకు నాడు-నేడు ద్వారా లక్షల రూపాయలు పెట్టి రూపురేఖలు మారుస్తూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేస్తుంది. అలాగే విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలో అందించే విద్యతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్యను అందించేందుకు మౌలిక వసతులు కల్పిస్తోంది. అయితే అసలైంది విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులే లేక పోతే ఇక ప్రభుత్వం ఎన్ని మౌలిక కల్పిస్తే ఎందుకు? దీనికి నిదర్శనమే నియోజకవర్గ కేంద్రమైన కురుపాం మోడల్ స్కూల్లో గత నాలుగు నెలలుగా గణిత ఉపాధ్యాయుడు లేదు. దీంతో విద్యార్థులు గణితం విద్యకు నోచుకోని పరిసితి ఏర్పడింది. సిలబస్‌యే పూర్తి కానప్పుడు ఇప్పుడు ఎఫ్ఎ-2 పరీక్షలు దగ్గరవుతున్న నేపథ్యంలో గణితం బోధించకుండానే విద్యార్థులు ఎలా పరీక్షలు రాస్తారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా గణితం ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు లెక్కలు చెప్పకుండా ఎలా పరీక్షలు నిర్వహిస్తారో తెలియదంటున్నారు. ఇంత కాలంగా సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోతే ప్రిన్సిపల్, విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే గణిత ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు విద్యను అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి -గరుగుబిలి

చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని స్థానిక శాఖా గ్రంథాలయ నిర్వహకులు నల్ల మధుసూదనరావు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పరవస్తు చెన్నైసూరి రచించిన పంచతంత్ర కథలు విద్యార్థినిలచే చదివించారు. కథలు చెప్పడం, ఆటలు ఆడించడం మొదలగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30మంది విద్యార్థులు పాల్గొన్నారు.

4 నుంచి స్పేస్ వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

వరల్డ్ స్పేస్ వీక్ ఈనెల 4 నుండి 8వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ ప్రేమ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరల్డ్ స్పేస్ వీక్ సందర్భంగా ఇస్రో నిర్వహించే కార్యక్రమాన్ని ఈ ఏడాది ఉత్తరాంధ్రకు కేటాయించినట్టు తెలిపారు. అందులో భాగంగా ఈ స్పేస్ వారోత్సవాలు విశాఖపట్నంలో గల రఘు ఇంజనీరింగ్ కాలేజీలో జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు సాయంత్రం 4 గంటలకు ఆర్‌కె బీచ్‌లో జరిగే స్పేస్ వాక్‌కు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఇస్రో ప్రధాన శాస్త్రవేత్తలు ఒక్కొక్క రోజు ఒక్కొక్కరు హాజరవుతున్నారని చెప్పారు. రఘు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే మెగా స్పేస్ వీక్ 10 ఎకరాలలో జరిగే స్పేస్ ప్రదర్శన కార్యక్రమానికి విద్యార్థులను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. వివిధ పోటీలు నిర్వహిస్తున్నారని, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనేలాప్రేరణ కల్పించాలని అన్నారు.

పోటీల వివరాలు :

అక్టోబరు 6న - క్విజ్ (ఫైనల్) (అంశం : స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ), వ్యాసరచన (అంశం: నిత్య జీవితంలో ఇస్రో పాత్ర)., 7న - చిత్ర లేఖనం - (అంశం: ఇస్రో ఇన్ స్పేస్), పోస్టర్ తయారీ (అంశం : రోల్ ఆఫ్ ఇస్రో) అన్ని మండలాల విద్యా శాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరవుతున్న విద్యార్థు వివరాలను ఈనెల 2లోగా https://docs.google.com/forms/d/e/1FAIpQLSdLH9ZtuVBjLnVl05GUo89-03nX0-T0rZq3iVzPDR3gYII18w/viewform?usp=pp_url కు నమోదు చేసుకోవాలని సూచించారు. వరల్డ్ స్పేస్ వీక్ మనకు దగ్గరలో జరపడం విద్యార్థులకు మంచి అవకాశమని, ఎక్కువ మంది విద్యార్థులు జిల్లా నుంచి పాల్గొనేటట్లు చేసి విద్యార్థుల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి కావలసిన ప్రేరణ మనసులో నాటేలా చూడాలన్నారు. ఇస్రో నిర్వహిస్తున్న స్పేస్ ఎగ్జిబిషన్ విద్యార్థులు చూసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇండియాలో స్పేస్ ప్రారంభం నుంచి నేటి వరకు సాధించిన జర్నీ గురించి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ అందరూ చూడడం ద్వారా, వివిధ రకాలైన పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వరల్డ్ స్పేస్ వీక్‌ను విజయవంతం చేయాలని జిల్లా సైన్సు అధికారి జి.లక్ష్మణరావు కోరారు.

పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్వచ్ఛత హీ సేవాను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ సన్యాసిరాజు స్మారక పురపాలక ఉద్యానవనంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఇందులో భాగంగా పార్క్‌లో చెత్తను శుభ్రం చేయడం, కాలువల పూడిక తీయడం కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రహరీ గోడలకు రంగులు, చెట్టు చుట్టూ ఉన్న దిమ్మలకు సున్నం వేసి ఆహ్లాదకరంగా తయారు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంఘంగా ఏర్పడి శ్రమదానం చేయడం వల్ల మన పరిసరాల్లో ఉండే ఉద్యానవనాలు, బహిరంగ ప్రదేశాలు సామాజిక బాధ్యతగా శుభ్రం చేయవచ్చని తెలిపారు. అనంతరం ఉద్యానవనం నుండి చర్చి వీధి చివరి వరకు అధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించి, స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేసి, కాలువల్లో పేరుకు పోయిన పూడికలను తొలగించి స్ఫూర్తిని, ప్రేరణను కల్పించారు. ఉద్యానవనం ఆవరణంలో ముగ్గులు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, రెడ్ క్రాస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, పురపాలక సంఘం కమిషనర్ జె.రామఅప్పల నాయుడు, సచివాలయ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. వీటితో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు సీతానగరం మండలం పెద భోగిలిలో స్వచ్ఛత హీ సేవ శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఆధ్వర్యాన

భారతీయ స్టేట్ బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక పట్టణ రైల్వే స్టేషన్ పరిధిలో స్వచ్ఛత కార్యక్రమం జరిగింది. కార్యక్రమములో స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎ.ఎ.హసీబ్, చీఫ్ మేనేజర్ ఎం.రవి శంకర్ ప్రసాద్, ఎల్‌డిఎం జెఎల్ఎన్ మూర్తి, ఇతర ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది. టౌన్ రైల్వే స్టేషన్ మాస్టర్ మహేష్ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : గ్రామాలలో పారిశుధ్యం బాధ్యత కేవలం స్థానిక ప్రభుత్వాలదే కాదని, గ్రామస్థులు కూడా సామాజిక బాధ్యతగా స్వీకరించాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పెదబొండపల్లిలో స్వచ్ఛత హై సేవా కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన స్వచ్ఛంధ పారిశుధ్య పనులలో పాల్గొన్న ఆయన వీధిల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి స్వయంగా పారిశుధ్య పనులు నిర్వహించి, కాలువల్లో మురుగు తొలగించారు.

సాలూరురూరల్ : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బాగువలస పరిసరాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభ్రం చేశారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాగాన రామునాయుడు ఆధ్వర్యాన పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో సర్పంచ్ జి.సుజాత ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, ఎంపిడిఒ వివి శివరామప్ప ముఖ్య అతిథిలుగా హాజరై శివన్నపేట పరిసరాలను ప్రాంతాలను చీపురు పట్టి పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పిఒపిఆర్‌డి, ఎంపీటీసీ టీవీఎస్ స్వామియోజులు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాటరషెడ్ పరిధిలో ఉన్న ఎల్విన్ పేట మైక్రో వాటర్ షెడ్ ఎస్‌కె పాడు నర్సరీలో నిర్మాణంలో అమృత సరోవర్ వద్ద ఎంపిడిఒ సాల్మన్ రాజు, సర్పంచి ఆర్ చైతన్య స్రవంతి, వాటర్ షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ పోలినాయుడు మొక్కలు నాటారు. డుమ్మంగి పంచాయితీ గుణదలో యువత, మహిళలు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, ప్రజారోగ్యాన్ని కాపాడతామని గ్రామంలో ప్రతిజ్ఞ చేశారు. ప్రజలను చైతన్య పరుస్తూ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు, కార్యదర్శి డి నాగరాజు ఉన్నారు. జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడిలో సర్పంచి శీమల సుజాత ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్తులు ఆ రోడ్లపై శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబు, భువన్ మోహన్ రావు ఉన్నారు.

భామిని : మండలంలోని మనుమకొండ పంచాయతీలో స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవలో రోడ్లను ఊడ్చి, పరిసరాల్లో చెత్తను తొలిగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఏరియా హాస్పిటల్‌లో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచారు. అలాగే టిటికిపాయిలో ఎంపిపి ఆదినారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లిరాణి ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు.



కాలువలో మురుగు తొలగిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

గుమ్మలక్ష్మీపురం : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో జియమ్మ వలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను శ్రమదానం చేసి విద్యార్థులు తొలగించి పరిశుభ్రత పరిచారు. అనంతరం మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షిస్తామని, పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ రాజేంద్రప్రసాద్, డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో స్వచ్ఛత సేవపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, పంచాయతీ ఈఒ వి రామచంద్రరావు, బి.మాణిక్య చంద్రశేఖర్, బి.లక్ష్మీనారాయణ, కె.ప్రేమ్ భూషణరావు, సత్యారావు, డి.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలసలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్. పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి లెంక గోపాలరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలో పెదబొండపల్లి, మూడడ్లవలస, గంగాపురంలో జల జీవన్ మిషన్ పథకం కింద పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ముందుగా పెదబొండపల్లిలో రూ.28.80 లక్షల అంచనా వ్యయంతో 40 కిలో లీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సుడిగాం పంచాయతీ మూడడ్లవలసలో రూ.15లక్షల అంచనా వ్యయంతో 20 కిలో లీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం గంగాపురం పంచాయతీలో రూ.12.80 లక్షల అంచనా వ్యయంతో 15 కిలో లీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఘనంగా పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, తహశీల్దార్ శివన్నారాయణ, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు, సవరపు తవుడమ్మ, పైల సూర్యనారాయణ, లక్ష్మి, నాయకులు చంద్రశేఖర్, శివాజి, బొమ్మి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు

టైర్ల సంరక్షణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్‌టిసి డిపోలో టైర్లు సంరక్షణ పక్షోత్సవాలను డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందిచే టైర్లకు సంబంధించిన జాగ్రత్తలను ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారంలో రెండుసార్లు టైర్లుల్లో గాలి చెకింగ్ చేయాలని, ప్రతిరోజు టైరుల్లో ఇరుక్కున్న రాళ్లు తొలగించాలని, సడన్ బ్రేక్లు వేయకుండా చూడాలని, టైరు పంచర్ను గమనించి వెంటనే టైరు డ్రైవర్లు మార్చుకోవాలని, రోడ్డు కండిషన్ బట్టి బస్సులు నడుపుదామని, పలు జాగ్రత్తలు చెప్పారు. అలాగే టైర్లు మైలేజీ పెంచుతాము, టైర్లు పై ఖర్చు తగ్గిద్దామని అందరి చేత ప్రమాణం చేయించారు.


కురుపాంలో వృద్ధులను సన్మానిస్తున్న తహశీల్దార్, సిబ్బంది

వృద్ధులకు సన్మానం

ప్రజాశక్తి - పాలకొండ

అంతర్జాతీయ సీనియర్ సిటిజన్ దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల సన్మాన కార్యక్రమం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కాంతమ్మ, గుడ్ల రాజ్యలక్ష్మి, ఉత్తరావల్లి మురళీమోహనరావు, జామి భాస్కరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ రోషిరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ డి.శేఖర్, విఆర్ఒ బలివాడ శ్రీనివాసరావు, మాచర్ల విజయభాస్కరరావు పాల్గొన్నారు.

కురుపాం : అంతర్జాతీయ వయోవద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వయోవృద్ధ ఓటర్లకు తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ కురుపాం నియోజకవర్గ పరిధిలో గల 80 ఏళ్లు దాటిన వృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80ఏళ్ల వరకు ఎంతో ఆరోగ్యంగా ఉండి ఓటు హక్కును వినియోగించుకోవడమంటే వారికి ఎంతో గర్వకారణమని అన్నారు. విఆర్ఒలు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన జగనన్న ఇళ్ల పథకం జగనన్న కాలనీకు చెందిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉధృతం చేస్తామని ఆందోళన చేస్తామని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, మంచాల శ్రీనివాసరావు అధికారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పథకానికి సంబంధించి జిల్లాస్థాయి అధికారులు దర్యాప్తులు చేయకపోవడం వల్ల ఇటువంటి ఆరోపణలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల విషయంపై నిజమైన పేదలకు ఇళ్లు ఇచ్చే విషయం పైన కూడా అధికారులు పర్యవేక్షణ లేదని అన్నారు. అందువల్ల నిజమైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదన్నారు. కావున మండలంలో జగనన్న కాలనీలకు సంబంధించిన అన్ని ఇళ్లను దర్యాప్తు చేసి నిజమైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. లేకుంటే సిపిఎం, ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

కృష్ణమూర్తి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలసకు చెందిన బోను కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు గొట్టివలసలోని స్వగృహంలో కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. మాజీ సర్పంచ్ సింహాచలంనాయుడు మృతి చెందడం బాధాకరమన్నారు. పరామర్శలో ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైసిపి నాయకులు బోను చంద్రశేఖరరావు(చంద్ర), మరడ వెంకటనాయుడు, తదితరులు ఉన్నారు.

1104 యూనియన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం విజయనగరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.అప్పారావు, వై.మంగారాజు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రీజనల్ అధ్యక్షులు వి. లక్ష్మణ్, డి.రాజేంద్ర ప్రసాద్ లు వ్యవహరించారు.

శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పిల్లలకు విజ్ఞాన పరమైన పరిజ్ఞానం కోసం వారికి కొన్ని సూచనలు, చిట్కాలు పాటిస్తే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చునని స్కూల్ అసిస్టెంట్ షణ్ముఖ రావు పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి బి.గణేష్ బాబు, పాఠకులు సాయి, భాస్కర్ రావు, వివేక్, అజయ్, పిల్లలు పాల్గొన్నారు.


చిన్నారులతో చదివిస్తున్న గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయుడు

సిట్టింగుల్లో గుబులు



- సిఎం జగన్ మాటలతో అయోమయం
- పైపైన గంభీరం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాటలు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తున్నాయి. చాలా వరకు వారిలో అయోమయ పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ పైకి మాత్రం గంభీరం ప్రదర్శిస్తూ సీట్లపై దీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా కొంతమంది సిట్టింగులకు ఉద్వాసన తప్పదని వైసిపి అధినేత జగన్ చాలా క్లారిటీగానే చెప్పిన విషయం తెలిసిందే. పార్టీ అధినేత తన క్యాంపుకార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య నాయకులతో సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో వచ్చే ఎన్నికలు, సీట్ల కేటాయింపు తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా 'మీలో చాలా మందికి మళ్లీ టిక్కెట్లు రావచ్చు. కొంతమందికి ఇవ్వలేకపోవచ్చు. టిక్కెట్ వచ్చినా, రాకపోయినా మీరు నా మనుషులే. ఎన్నికల్లో తప్పులు జరక్కూడదని తీసుకున్న నిర్ణయాలకు అందరూ సహకరించాలి' అంటూ జగన్ స్పష్టం చేశారు. దీంతో, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఈ సారి ఎన్నికల్లో ఎవరిని బరి నుంచి తప్పిస్తారో? అన్న ఆసక్తికర చర్చ కూడా ఎమ్మెల్యేలతోపాటు వారి అనుయాయులు, కార్యకర్తల్లోనూ మొదలైంది. విజయనగరం జిల్లాలో ఏడు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. వీరిలో కొంతమంది పనితీరు బాగోలేదని కూడా గతంలో సిఎం పరోక్షంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. వీరిలో ఈసారి మంత్రులిద్దర్నీ ఎంపీలుగా పోటీ చేయించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్టుగా కూడా చాలా కాలంగా చర్చనడుస్తోంది. ఈ సంగతి కాస్త పక్కనబెడితే సిట్టింగుల్లో పార్టీ అధినేత జగన్ సర్వేలో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయనేది ఇంకా బహిర్గతం కాలేదు. ఈ మాటకొస్తే కేవలం పనితీరు ఒక్కటే ప్రమాణికం కాదని, సంబంధిత నియోజకవర్గాల్లో ప్రజల స్పందన, ఆయా ఎమ్మెల్యేలను అభిమానించడం లేదా అసంతృప్తి వ్యక్తం చేయడం వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటారని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని రాజకీయ పరిస్థితులను భేరీజు వేస్తే గతం మాదిరిగా వైసిపికి వన్‌వే కనిపించడం లేదు. కొన్ని నియోజకవర్గాల్లో ముఖ్యంగా గజపతినగరం, నెల్లిమర్ల, కురుపాం, బొబ్బిలి, రాజాం, పాలకొండ, ఎచ్చెర్ల, విజయనగరం నియోజకవర్గాల్లో పార్టీ పథకాలపై తప్ప, స్థానిక ఎమ్మెల్యేలపై ప్రజలేమీ అంత సంతృప్తికరంగా లేరని అదే రాజకీయ పార్టీకి చెందిన నాయకులే విశ్లేషిస్తున్నారు. అటు ఎస్.కోటలో పార్టీకి కొంత అనుకూలంగా వున్నప్పటికీ అంతర్గత విభేదాలు తారా స్థాయికి చేరాయి. కార్యకర్తలకన్నా నాయకులే ఎక్కువగా ఉండడం ఇందుకు కారణం. పార్వతీపురం ఎమ్మెల్యే జనంలో తలలో నాలుకలా ఉన్నప్పటికీ ప్రతిపక్షం తీసుకునే రాజకీయ వ్యూహాన్ని బట్టి ఆయనకు అనుకుల, ప్రతికూల పరిస్థితులు అంచనా వేయడం సాధ్యమౌతుంది. పార్టీ ఇచ్చిన పిలుపుల్లో భాగంగా ప్రజల్లో తిరగడంలో మాత్రం వీరిలో ఎవరూ పెద్దగా వెనుకబడినట్టుగా కనిపించడం లేదు. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో సీట్ల విషయమై అధినేత అంతర్గత సర్వేపై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. మొత్తంగా ఈ రెండు జిల్లాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో టిక్కెట్ల గండం ఎవరికి ఉందనేది సంక్రాంతి వరకు బయటపడే అవకాశాలు లేవని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. టిక్కెట్లు రావనే విషయం ముందస్తుగానే బహిర్గతం చేస్తే అసంతృప్తితో పార్టీకి నష్టం చేకూరే నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండా పార్టీ అధిష్టానం చాకచక్యంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. అందుకే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అందరూ తన మనుషులే అన్న విధంగా భావిస్తానంటూ పార్టీ అధినేత జగన్ చెప్పున్నారని పలువురు గుర్తు చేస్తున్నారు.


పైడిరాజు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మహిళలను క్రీడల్లో ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గ్రామీణ ప్రాంతాల మహిళలను ఆటల్లో ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అథ్లెటిక్ కనకల పైడిరాజు అన్నారు. అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించిన కనకల పైడిరాజును మండలంలోని మామిడిపల్లికి చెందిన యువత సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్ట్ 19 నుంచి 23 వరకు శ్రీలంక కొలంబో ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించినందుకు తనకు గర్వంగా ఉందన్నారు. తాను ఏడో తరగతి చదివేటప్పుడు పిఇటి పొట్నూరు శ్రీరాములు మాస్టర్ వద్ద శిక్షణ పొందానని, పదో తరగతి వరకు అదే స్కూల్లో శ్రీరాములు మాస్టర్ శిక్షణ ఇచ్చారని తెలిపారు. పెళ్లియినా తన భర్త గణపతి, అత్తమామల సహకారంతో తాను ఈ స్థాయికి చేరానన్నారు. గ్రామ పెద్దలు బూస తవుడు, సువ్వాడ రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో పుట్టి ఇక్కడే చదువుకొని పెళ్లి అయిన ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉద్యోగం చేస్తూ పెంచుతూ ఇంటర్ నేషనల్‌లో సిల్వర్ మెడల్ సాధించడం తమ గ్రామానికి ఆదర్శంగా నిలిచావని పైడిరాజును కొనియాడారు. కార్యక్రమంలో సాలూరు మున్సిపల్ మాజీ చైర్మన్ జరజాపు ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ నాగ వంశం సెల్ డైరెక్టర్ జరజాపు నీలిమ, వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, సువ్వాడ రామకృష్ణ, బూస తౌడు, డొంక కరుణ, డొంక గోపాల్ స్వామి, తాడుతూరి చినబాబు, డొంక సుధాకర్, హరి రామారావు, బూస తిరుపతిరావు గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

రోగికి పెన్షన్ అందజేత

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక పంచాయతీలో పని చేస్తున్న వాలంటీర్లు తమ సేవా భావాన్ని చాటి చెబుతున్నారు. ప్రతినెలా పెన్షన్ ఇస్తున్న సమయంలో లబ్ధిదారుడు అనారోగ్యంతో ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి ఇస్తున్నారు. ఇందులో భాగంగానే బొబ్బాది తేజావతి వృద్ధురాలు అనారోగ్యంతో భామిని మండలం గురండి ఉండడంతో వాలంటీర్ ఆరిక దేవి అక్కడకు వెళ్లి పింఛను అందించారు.

'బాబుకు తోడుగా మేము'


సీతంపేటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు జయకృష్ణ, సాగర్

ంంప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, పరిశీలకులు కలమటి సాగర్ ఆధ్వర్యంలో సీతంపేటలో చంద్రబాబుకు తోడుగా మేము సైతం కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. జగన్ ఫ్యాక్షనిస్టు రూపాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. పోలీసుల అండతో అరాచకాలు సృష్టిస్తున్న జగన్ ప్రభుత్వంపై కేంద్రప్రభుత్వం వెంటనే దృష్టి సారించి రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, పాలక రాజాబాబు, మహాశక్తి ప్రచార కర్త తోయిక సంధ్యారాణి, ఐటిడిపి కో-ఆర్డినేటర్ హిమరక పవన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రిపాడులో

మండలంలో టిడిపి నాయకులు పడాల భూదేవి మర్రిపాడు పంచాయతీ మూలగూడలో బాబుతో నేనుసైతం కార్యక్రమం నిర్వహించి వైసిపి దుష్టపాలన, దౌర్జన్యాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. గ్రామంలో వరద గోడ, మంచినీరు, రహదారి సౌకర్యం లేదని భూదేవి ఎదుట వాపోయారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర కుంపి, నాయకులు సవర మంగయ్య, సవర మల్లేష్, సవర చిన్నారావు, మర్రిపాడు వైస్ ప్రెసిడెంట్ సవర జమ్మయ్య, ఓబియో, మార్కో, సిమియో, ఎల్లంగో, తదితరులు పాల్గొన్నారు.

నేడు కురుపాంలో నిరసన దీక్ష

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దీక్షకు మద్దతుగా నేడు కురుపాం మండల కేంద్రంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు శత్రుచర్ల విజయరామరాజు హాజరవుతున్నట్లు తెలిపారు. ఐదు మండలాల్లోని అధ్యక్ష కార్యదర్శులు, యూనిట్ ఇన్‌ఛార్జీలు, బూత్ ఇన్‌ఛార్జీలు, గ్రామ కమిటీ సభ్యులు, టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని ఆమె కోరారు.

టిడిపిలోకి 30 కుటుంబాలు

మండలంలో ఇటీవల కాలంలో పలు కుటుంబాలు టిడిపిలో చేరుతున్నాయి. మొన్న కప్పకల్లులో 50 కుటుంబాలు టిడిపిలో చేరగా ఆదివారం చెముడుగూడలో మరో 30 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో టిడిపికి ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్ ఫోన్ లైట్లు మధ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు పాడి సుదర్శన్ రావు, పోలూరి శ్రీనివాసరావు, నాయకుల చిరు, మల్లి,రామారావు ఉన్నారు.

కేసలిలో రిలే నిరాహార దీక్ష

పాచిపెంట : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని కేసలిలో మండల టిడిపి అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజ్‌దేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 కుటుంబాలు జన్ని కొండలరావు ఆధ్వర్యంలో టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముఖీ సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, చల్ల కనకారావు, కె.పోలినాయుడు. దండి మోహన్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు ఆధ్వర్యంలో రాజుపేట, అర్తాలి, ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో గొర్లె రాంబాబు మాజీ సర్పంచ్ బొమ్మలాట శంకరరావు, యందవ సత్యం నాయుడు, కోడి శ్రీహరి మజ్జి శ్రీను నాశ గణపతి బొమ్మాలి సురేష్, కిమిడి బంగారునాయుడు, జీలకర్ర మోహన్, తాడేలా గణేశ్వరరావు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాలూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్


విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే జీవనాడి లాంటి స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్ర ప్రభుత్వ విరమించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లె వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మూడో వార్డు వివేకానంద కాలనీలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమైన చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై సిపిఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో బైక్ యాత్ర ద్వారా ప్రచారం జరిగిందని, ఇందులో భాగంగా అక్టోబర్ 5న విశాఖపట్నం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని, ఈ బహిరంగ సభకు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభలో ప్రజలు పాల్గొని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై జరుగుతున్న ఆందోళనకు మద్దతు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.కృష్ణ, ఎస్ చిన్నారావు, పి.లక్ష్మణరావు, గోవింద, డి.వెంకటరమణ, గౌరమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: విశాఖ ఉక్కు కర్మాగారం రక్షణ కోసం జరుగుతున్న పోరాటం లో భాగంగా ఈనెల 5న విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు కోరారు. ఆదివారం ఆయన దీనికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి బహిరంగ సభ లో మాట్లాడుతారని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లా లకు చెందిన కార్మికులు ఉద్యోగులు యువకులు ఈ సభకు హాజరు కావాలని ఎన్వైనాయుడు కోరారు.

ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్


ఆదివాసీలకు ద్రోహం చేస్తూ బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చరాదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చరాదని ఆదివాసీ గిరిజన సంఘం పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు ద్రోహం చేస్తూ బిసి-ఎలో ఉన్న గిరిజనేతరులైన 40 లక్షల మంది బోయ వాల్మీకి, బెంతురియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ 28 లక్షలకు పైబడి ఆదివాసీలకు ద్రోహం చేస్తూ ఆమోదం చేసిన తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేవారు. జిఒ 3ను రద్దుచేసి నాలుగేళ్లయినా రివ్యూ పిటిషన్ వేయకుండా కాలక్షేపం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దీనిపై గిరిజన ప్రజాప్రతినిధులు గిరిజన ప్రాంతాల ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి మన గిరిజన చట్టాలను రక్షించుకోవడానికి గిరిజన సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.


చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న జగన్మోహన్‌రావు

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్‌ఆర్‌సి)ను జిల్లా ఆసుపత్రిలో ఆదివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అక్కడ అడ్మిట్ అయిన ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య వివరాల నమోదు రికార్డులు పరిశీలించారు. పది పడకల ఎన్‌ఆర్‌సిలో ప్రతి నెలా జరుగుతున్న అడ్మిషన్లు, డిశ్చార్జ్‌ల వివరాలు, చేరేతప్పుడు వారి బరువు, ఆరోగ్య స్థితి అదేలా డిశ్చార్జ్ అయ్యేనాటికి వారి బరువు ఆరోగ్య స్థితి ఏ మేరకు మెరుగైందీ పరిశీలించారు. వారికిస్తున్న పోషకాహార మెనూ పరిశీలించారు. ప్రతి బెడ్ వద్ద ఉన్న చిన్నారి ఆరోగ్య పరిశీలన చేసి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. అక్కడ పిల్లల బరువును స్వయంగా తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ఆశాజ్యోతి, దివ్యతేజ ఉన్నారు.


రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్ఐ కళాధర్

రహదారి గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - కురుపాం

జియమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్ వద్ద గుంతల మయమైన రోడ్డుతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనచోదకులు, ప్రయాణికుల ఇక్కట్లును చూసిన చినమేరంగి ఎస్ఐ కళాధర్ ఆదివారం రోడ్లపై గుంతలను కప్పించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఎన్నో నెలలుగా వాహన చోదకులు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాత్కాలికంగా కష్టాలు తీర్చి ప్రయాణ మార్గాన్ని సులభతరం చేసినందుకు ఎస్ఐకు ప్రజలు, వాహనచోదకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జెఎఎస్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కొత్తూరులో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి కెకె సాగర్‌వర్మ ఆదివారం పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ వైద్య శిబిరాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా వైద్యశిబిరం ఎక్కడఏర్పాటు చేస్తున్నారన్న విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు బంటు అప్పారావు, అంబటి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.


నాటకను ప్రదర్శిస్తున్న కళాకారులు

పెదమేరంగిలో నాటక పోటీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదమేరంగిలోని సత్య కైలాస్ పాఠశాలలో పెద మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఉభయ రాష్ట్రాల నాటక పోటీలు అద్భుతంగా నిర్వహిస్తున్నారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న విషయాలను సెల్, టీవీల్లో చూస్తున్నప్పటికీ నాటక రంగం ద్వారా చూడడం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని కళాకారులు తెలిపారు. ప్రజలంతా నాటకాలను తిలకించేందుకు తరలి రావాలని కోరారు.

విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రయాణికులకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని జనసేన మండల నాయకులు శివశంకర్ పోతుల డిమాండ్ చేశారు. ఆదివారం జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విశ్రాంతి భవనం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో విశ్రాంతిభవనం ఉన్నప్పటికీ అది పూర్తిగా శిథిలమవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి విశ్రాంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పిడుగు పడి వ్యక్తి మృతి


మృతి చెందిన సింహాచలం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగికి చెందిన ముదిలి సింహాచలం (39) పిడుగు పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవగాంలో నిత్యవసర వస్తువులు కొనుక్కొని తిరిగి ఇంటికి ప్రయాణమైన సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తె, 7నెలల కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గంగన్నదొరవలస వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఫక్రుద్దీన్ అందించిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం కుద్దివలసకు చెందిన ఉయ్యాల రాము (27), విజయ్‌కుమార్, పాచిపెంట మండలం తురాయిపాడుకు చెందిన జె.పోలయ్య కలిసి సాలూరు నుంచి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై పి.కోనవలస వైపు వస్తుండగా గంగన్నదొరవలస వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనం ద్వారా సాలూరు సిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సాలూరు నుండి విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉయ్యాల రాము మృతి చెందాడు. విజయ్‌కుమార్, పోలయ్య చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో నాటు సారాతో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. నిడగల్లుకు చెందిన కస్తూరి రామునాయుడును నీలకంఠాపురం దగ్గరలో నాటుసారాతో పట్టుకున్నామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి బొబ్బిలి కోర్టుకు రిమాండ్ నిమిత్తం పంపినట్టు తెలిపారు.